"తల్లి దండ్రుల్ని క్షోభ పెట్టి, శత్రువర్గంలోకి చేరి తను పడబోయే పాట్లు వాడికి తెలీవు. మున్నాళ్ల పట్టపగల్లో ఆ మోజు తీరుతుంది. ఇద్దరూ బొచ్చె పట్టుకు బయల్దేరతారు". కాశీపతి శాపనార్థాలు మొదలెట్టాడు.

* * *

శారద - శంకరం పెళ్లి చేసుకున్నారు. పెళ్లికి రంగారావూ వసుంధర గానీ, కాశీపతీ - వరమ్మ గానీ, రమాదేవీ సింహాచలంగానీ రాలేదు. ఎవరిళ్లల్లో వాళ్లు చిందులు వేశారు.

శారద - శంకరం తమ పేర్లమీదే శుభలేఖలు అచ్చొత్తించుకుని వీళ్లందర్నీ పిలిచారు.

పెళ్లి కాకినాడలో జరిగింది - చాలా నిరాడంబరంగా. నేనూ మరో నలుగురు మిత్రులూ — అప్పుడున్నది.

వీళ్ల పెళ్లి వలన నాకో గొప్ప సత్యం తెలిసింది. పెళ్లి కూడా పుట్టుకలాగానే యాక్సిడెంట్ అని.

శంకరం తన మకాం కాకినాడ మార్చేడు. శారద ట్రాన్స్‌ఫర్‌కి ప్రయత్నాలు మొదలెట్టింది — కాకినాడకు.

ఇరువైపులా తల్లిదండ్రులు సంబంధాలు తెంచేసుకుని, దుఃఖాన్ని పెదవులమీద బిగపట్టుకుని, భేషజాన్నీ పట్టుదలనీ మొహాన్ని చెండుకుని భీష్మించుక్కూర్చున్నారు. కొత్త దంపతులు మాత్రం ఈ పరిస్థితుల్ని చిరునవ్వుతోనే స్వీకరించారు.

కంచుమరచెంబుకు తేలుకుట్టినట్టు నాకు గుండెల్లో ఎక్కడో సన్నని బాధ. ఇదమత్థంగా ఎందుకో చెప్పలేను.

పెళ్లినుంచీ తిరిగి విశాఖ వచ్చాను. సింహాచలం వివరాలన్నీ అడిగి తెలుసుకున్నాడు. వాడి ముఖంలో ఆవేదన, కళ్లల్లో బాధ -

కొట్టొచ్చినట్టే కనిపించినై.

ఒక్కొక్కళ్ల ఎదకూ ఎన్నెన్ని గదులున్నాయా అనిపించింది నాకు —

మజ్జిగ తెచ్చేముందరే ఉప్పుగల్లు అడగటం ఎందుకులే అన్నట్టు — వాళ్ల సంసారం గురించీ, వాళ్ల భవిష్యత్తు గురించీ — ఎవరికి వాళ్ళం గమ్మున ఊరుకున్నాం.

నాలుగు నెలల తర్వాత ....

తనకు కాకినాడ బదిలీ అయినట్టు; శంకరం స్వంతంగా 'గేరేజ్' ప్రారంభించినట్టూ — శారద ఉత్తరం వ్రాసింది. ఉత్తరంలో విశేషాలు విని — సింహాచలం అన్నాడు, "ఇల్లు అలకగానే పండగ కాలేదు; ముందున్నది ముసళ్ళ పండగ" అని.

* * *

రాత్రి తొమ్మిది గంటలైంది.

టేప్ రికార్డర్ ని ట్యూన్ చేసి, తమలపాకు ప్లేటుతో వచ్చి కుర్చీలో కూర్చుంది శారద. పక్కన వాలుకుర్చీలో శంకరం దినపత్రికని తిరగేస్తున్నాడు.

"మీకు గుర్తుందో లేదో. మన పెళ్లిలో నా ఫ్రెండ్ సుమిత్ర వో సంగతి చెప్పింది. 'తోరణపు చిగుళ్లు మేస్తున్న బలిపశువులా అదివ్వాళ ముసిముసి నవ్వులతో మధురోహల్లో తేలిపోతూనే వుంటుంది. ముందు ముందు కుక్కచావు ఛస్తుంది' — అని మానాన్న అన్నాడని. నాకెందుకో ఇవ్వాళ ఆయనన్నాడన్న మాటలే గుర్తుకొస్తున్నై."

తమలపాకు చిలకని అందుకుంటూ భార్య కళ్లల్లోకి చూసేడు శంకరం.

స్వామి ముందర వేసిన సాంబ్రాణి ధూపంలా వుందామె.

